సిల్వర్ ఓక్ మొక్కల పంపిణీ

ప్రజాశక్తి- పెదబయలు: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సీతగుంట పంచాయతీకి సంబంధించి ఏడుగురు రైతులకు ఎంపీపీ బోండా వరహాలమ్మా చేతుల మీదుగా సిల్వర్ ఓక్ మొక్కలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, మొక్కలకు ఎరువులు వేసుకొని నాటుకోవాలన్నారు. ఎంపీడీవో విగ్గేష్ మాట్లాడుతూ, రైతులకు సకాలంలో మొక్కలు అందించడంతో పాటు మూడు సంవత్సరాల వరకు మెయింటెనెన్స్ ఖర్చులు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వరహాలమ్మ, సీతగుంట సర్పంచి పి.మాధవరావు, ఎంపీటీసీ కె.బొంజుబాబు పాల్గొన్నారు.

మొక్కలు ఇస్తున్న ఎంపిపి

దిన దిన గండంగా చదువులు

▶▶ శిథిలమైన పాఠశాల భవనం - అసంపూర్తి సచివాలయంలో విద్యా బోధన

▶▶ వర్షాలు, చలిగాలులతో విద్యార్థులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: బడుల్లో అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్ప ఆచరణలో పూర్తి స్థాయిలో అమలు కాలేదు. దీంతో ప్రభుత్వ బడిలో చదువుతున్న గిరి విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. ఇందుకు నిదర్శనం గసభ పంచాయతీ కేంద్రంలోనున్న ప్రాథమిక పాఠశాల భవనమే. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం పూర్తిగా శిథిలవస్థలో చేరి కూలి పోయే పరిస్థితిలో ఉండటంతో ఆ పాఠశాలలోని విద్యార్థులకు చదువు సాగించడం కష్టతరంగా మారింది. దీంతో, తప్పని పరిస్థితుల్లో ఆ గ్రామానికి నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవనంలో తరగతుల విద్యాబోధన సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ భవనం అసంపూర్తిగా నిర్మించి ఉండటంతో చలిగాలులు వీచినప్పుడు, వర్షాలు కురిసినప్పుడు అక్కడి విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అసంపూర్తిగా ఉన్న సచివాలయంలో చదువుతున్న విద్యార్థులు

మండలంలోని గసభ పాఠశాలలో సుమారు 22 మంది విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది క్రితం పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థలో చేరి కూలి పోయే పరిస్థితిలో చేరింది. అప్పటి నుంచి అధికారులు ఎటువంటి మరమ్మత్తు పనులు చేపట్టలేదు. పలుమార్లు ఆ గ్రామస్తులు సంబంధిత ఉన్నత అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ దశలో ఉన్న సచివాలయ భవనంలో తరగతుల బోధనలో సాగిస్తున్నారు. అక్కడ కిటికీలు, తలుపులు లేక పోవడంతో పాటు విద్యుత్, బ్లాక్ బోర్డు సౌకర్యం కూడా లేదు. దీంతో, ఉపాధ్యాయుడు విద్యార్థులకు గోడపై సుద్ధ ముక్కలతో రాస్తూ విద్యాబోధన సాగిస్తున్నాడు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో పాఠశాల భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

నిర్వాసితులకు పత్రాలు అందజేస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, అధికారులు

ప్యాకేజీ ఇచ్చి త్వరగా తరలించండి

- ఆర్ అండ్ ఆర్ గ్రామసభలో ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తిగా ఇచ్చి త్వరగా తరలించాలని ఎంపిపి కారం లక్ష్మి డిమాండ్ చేశారు. మండలంలోని రామవరం పంచాయతీ పరిధి అడివి వెంకన్నగూడెం గ్రామంలో శుక్రవారం ఆర్ అండ్ ఆర్ గ్రామసభ జరిగింది. పోలవరం సీనియర్ అసిస్టెంట్ స్ట్రక్చర్ వెలివేషన్‌తో కూడిన నోటీసులు ఇవ్వడంతో గ్రామసభలో రగడ మొదలైంది. ఈ సందర్భంగా ఎంపిపి కారం లక్ష్మి మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. స్ట్రక్చర్ వెలివేషన్‌తో కూడిన నోటీసులైతే ఇచ్చారు గాని ప్యాకేజీ సంగతి ఏమిటన్నారు. వరదల వల్ల ఇప్పటికే ప్రజలు చాలా నష్టపోయారని, తక్షణమే ప్యాకేజీ ఇచ్చి త్వరగా ఇక్కడ నుండి తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కారం బుచ్చమ్మ, సిపిఎం సీనియర్ నాయకులు కుంజా నాగిరెడ్డి, మండల నాయకులు కారం సుందరయ్య, బొప్పెన రాజు, గణేష్, జగన్, జోగారావు, కారం సత్యం, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

17 నెలల వేతనాలు చెల్లించాలి

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి-పాడేరు: తమకు 17 నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం పాడేరులో నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహిం చారు. తమ ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని పీఎంఆర్సి కార్యాలయం నుండి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించారు. ఐటిడిఏ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు మాట్లాడుతూ, తమకు ఉద్యోగ భద్రత, గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, కనీస వేతనం 26,000 మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని, ప్రతిభ ఉన్నవారికి ప్రమోషన్ ఇవ్వాలని, వేతనాల కోతను అరికట్టాలన్నారు.అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు గ్రామాల్లోని రైతులకు అనేక సేవలు అందిస్తున్నారని, ప్రభుత్వం సకాలంలో వేతనాలు ఇవ్వకుండా 17 నెలలు బకాయిలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.తక్షణం బకాయిలు చెల్లించి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. రోజురోజుకు ధరల పెరుగుతున్నా వేతనాలు అంతంత మాత్రమే చెల్లిస్తున్నారని, చట్ట ప్రకారం కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని వేతనాల్లో కోతల విధించరాదని తెలిపారు సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కొంట్యాడ సన్యాసిరావు తెలిపారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్ అప్పారావు, బి.సరస్వతి, అంబిరి చిట్టిబాబు, కూడా వెంకట్రావు, సత్యారావు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు, ఉద్యోగులు

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ మొస్య

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ పరిధి నిమ్మగుడ గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి స్థానిక సిపిఎం సర్పంచ్ కిల్లో మొస్య శుక్రవారం శంకుస్థాపన చేపట్టారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లింబగుడ గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి నిదులు మంజూరు చేయాలని స్థాక జెడ్పీటీసీ దీసరి గంగరాజును కోరగా జెడ్పి చైర్‌పర్సన్‌తో మాట్లాడి రెండు లక్షలు మంజూరు చేశారని, ఇందుకు గ్రామస్తుల తరుపున జెడ్పీటీసికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొన్ను పాల్గొన్నారు

కుళాయి వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

తాగునీటి కోసం గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ నరమామిడి గొంది గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ స్థానిక మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. నరమామిడి గొందిలో ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా వేసిన గ్రావిటీ తాగునీటి ట్యాంక్‌కు నీరు పంపించే మోటారు బోర్డు రెండేళ్ల క్రితం కాలిపోయింది. దీంతో గ్రామస్తులు మంచినీటి కోసం అష్ట కష్టాలు పడేవారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నాటి నుండి మోటారుకు మరమ్మతులు చేయలేదు. అయితే సత్యసాయి ట్రస్ట్ సహాయ సహకారాలతో ట్యాంక్ నుంచి పైపులైన్ ద్వారా కుళాయిలకు నీరు వచ్చే విధంగా ఏర్పాటు చేశారు. ఈ పైపులైన్ ద్వారా అరకొరనే మంచినీరు వచ్చేది. అయితే ఈ పైపులైన్‌లో మట్టి కూరుకుపోవడంతో ఐదు రోజులుగా పూర్తిగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తాగునీటి కుళాయిల వద్ద నిరసన తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి మోటార్ బోర్డుకు మరమ్మతులు చేయాలని, పైపులైన్‌లో కూరుకుపోయిన మట్టిని తొలగించి మంచినీటి సౌకర్యం కల్పించాలని మహిళలు డిమాండ్ చేశారు.

చెక్కును అందజేస్తున్న కలెక్టర్, పిఒ

75 స్వయం సహాయక సంఘాలకు

రూ.3 కోట్ల ఆర్థిక సాయం

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ఐటిడిఎ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) కార్యక్రమంలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో పాడేరు మండలంలోని 75 స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు మూడు కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులతో మాట్లాడిన కలెక్టర్ వారు ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొనే తీరును ఆరా తీసారు. ప్రతినిధులు స్పందిస్తూ కూరగాయల, చిల్లర సరుకుల, బట్టల వ్యాపారాలు చేసుకుంటామని వివరించారు. మరికొందరు వారపు సంతలలో అవసరమైన నిత్యావసర సరుకులు అమ్ముతామని చెప్పారు. గిరిప్రజలకు ఆర్థిక, ఆరోగ్య అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ వారపు సంతలలో దళారులు నాణ్యత లేని సరుకులు, కల్తీ సరుకులు అధిక ధరలకు అమ్ముతు గిరిజన వినియోగదారులను మోసం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మంచి నాణ్యతతో కూడిన కల్తీ లేని సరుకులు అమ్మితే స్వయం సంఘాలు బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ విజిలెన్సు అధికారులు, ఆహార కల్తీ నియంత్రణ అధికారులు పంచాయతి కార్యదర్శులతో బృందాలు ఏర్పాటు చేసి అటువంటి షాపులపై దాడులు నిర్వహించాలని సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డిని ఆదేశించారు. ఆయా సంతలలో స్వయం సహాయక సంఘాలకు కొన్ని షాపులు కేటాయించి వారిని ప్రోత్సహించాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్‌ను ఆదేశించారు. పంచాయతీ తరుపున వ్యాపారుల నుండి అధిక మొత్తాలు సేకరించి పంచాయతీలకు చెల్లించకుండా దళారులు తీసుకుంటూ పంచాయతి ఆదాయానికి గండి కొడుతున్నట్లు కూడా తన దృష్టికి వచ్చిందని, ఇటువంటి సంఘటనలు జరగకుండా పక్కా నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు అండగా నిలవాలని కలెక్టర్ సూచించారు.

ఉత్తరాంధ్ర జర్నలిస్టు ఫ్రంట్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చింతపల్లి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటైన ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ డైరీని ఆవిష్కరించుకోవడం ఆనందదాయకమని చింతపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేశెట్టి సతీష్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వనరాజు, గౌరవ అధ్యక్షుడు వీజే దయానంద్ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ డైరీని పాత్రికేయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సామాజిక బాధ్యతతో సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలనే సంకల్పంతో పాత్రికేయులు పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికే యులు పాంగి సురేష్, పీ.శ్రీనివాసరావు, షేక్ సత్తార్, అచ్యుతరామయ్య, షేక్ ఖాసింవల్లి, పవన్ సాయి, కృష్ణ పాల్గొన్నారు.

డైరీని ఆవిష్కరిస్తున్న పాత్రికేయులు

ముందస్తు వరద సహాయక చర్యలు చేపట్టాలి

గ్రామసభల్లో డిమాండ్

ప్రజాశక్తి- కూనవరం

వరద సహాయక చర్యలు ముందస్తుగా చేపట్టాలని మండలంలోని పెద్దఆర్కూర్ పంచాయితీ సర్పంచ్ నాగమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు పెద్దఆర్కూర్ గ్రామసభ సర్పంచ్ నాగమణి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదలకు సంబంధించి గ్రామంలో బఫర్ స్టాక్, బియ్యం, నిత్యావసర వస్తువులు, కిరోసిన్, కూరగాయలు అందుబాటులో ఉంచాలని సూచించారు. పునరావాస కేంద్రాలలో సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. పునరావాస కేంద్రాలైన బండారు గూడెం, రేపాక కాలనీ, పెద్దర్కూర్ గ్రామాలలో మంచి నీటి బోర్లు వేయించాలని కోరారు. వరద బాధితులు మూడు నెలల పాటు పనుల్లేక ఇబ్బంది పడతారని, కుటుంబానికి రూ.5 వేలు చొప్పున ఖర్చులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికల్ డిపార్ట్మెంట్ పర్యవేక్షణ ఉండాలని, పునరావాస కేంద్రాలను ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అడ్డుకోకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ అసిస్టెంట్ ఇంజనీర్, స్థానిక విఆర్ ఓ రాజారావు, ఎంపీటీసీ అమ్మాజీ, మాజీ ఎంపీటీసీ పాయం సత్యనారాయణ, బాబు బొర్రయ్య, పిచ్చయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

విఆర్.పురం : వరద సహాయక చర్యలపై అధికారులు శుక్రవారం మండలంలోని పోచవరంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, ఎంపిడిఓ అర్.ఫణీంద్ర స్థానిక గిరిజనులకు వరదలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ అందెల సీతారాం రెడ్డి, జెడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి మాట్లాడుతూ వరదల కారణంగా గ్రామస్తులకు కిరోసిన్, దోమతెరలు, టార్పాలిన్లు, సోలార్ లైట్లు, 3 నెలల రేషన్ సరుకులు ముందుగానే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ యం.రామకృష్ణ, విఆర్ఒలు, విఆర్ఎలు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ నాగమణి, పాల్గొన్న నిర్వాసితులు

విద్యుదాఘాతానికి గేదెలు సజీవదహనం

-ఆలస్యంగా వెలుగులోకి

-ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని జడ్డంగి మడేర్ ఆనకట్ట సమీపంలో విద్యుత్ ఘాతానికి గురై నాలుగు పాడి గేదెలు సజీవ దహనమయ్యాయి. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని జడ్డంగి చైతన్యనగర్ కాలనీలోని కాపురి వెంకటేశ్వర్లు అనే గిరిజన రైతుకు చెందిన మూడు పాడి గేదెలు, ఎ.బాబ్జికి చెందిన ఒక పాడి గేదె నాలుగు రోజులుగా కనిపించకపోవడంతో రైతులు వెతకడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం మడేరు వాగు సమీపంలో విద్యుదాఘాతానికి గురై సజీవ దహనమైన గేదెల మృతదేహాలు కనిపించాయి. అక్కడ ఒక రైతు పొలానికి ఏర్పాటు చేసిన విద్యుత్ ఎల్టి వైర్ తెగి కింద పడిపోగా, ఆ వైరును తాకిన పాడి గేదెలు కరెంట్ షాక్‌కు గురై సజీవ దహనమైనట్లు గుర్తించారు. తమకు జీవనాధారమైన పాడి గేదెలు మృత్యువాత పడటంతో బాధిత రైతులు కన్నీరు మున్నీరయ్యారు. సమాచారం అందుకున్న పశు వైద్యాధికారి తరుణ్ సంఘటన స్థలానికి చేరుకొని పోస్ట్ మార్టం నిర్వహించారు. పాడి గేదెలు మృతి చెంది నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

విద్యార్థులకు కంచాలు వితరణ

ప్రజాశక్తి- మారేడుమిల్లి

మండలంలోని చావడికోట పంచాయతీ పరిధిలోని తేనెల మామిడి, ముంతమామిడి, చావడికోట గ్రామాల్లోని జిపిఎస్ పాఠశాలల విద్యార్థులకు ఆదివాసీ మేలుకో చైతన్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కంచాలు పంపిణీ చేశారు. అనంతరం సంఘం నాయకులు జి బాబురావు గ్రామసభలు ఏర్పాటు చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకోవాలో గిరిజనులు చైతన్యం కలిగి ఉండాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ చట్టాలను ఒక్కొక్కటి ఏ విధంగా తొక్కుతున్నాయో తెలియజేశారు. గిరిజనులు ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముంతమామిడి పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ, కమిటీ సభ్యులు కె.వీరపురెడ్డి, ఎం.అబ్బాయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచాలు పంపిణీ చేస్తున్న బాబురావు

రైతులు, కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న జలగం వెంకటరావు

జలగం ట్రస్టు ద్వారా సబ్సిడీపై మోటార్లు

ప్రజాశక్తి-చింతూరు

జలగం ట్రస్టు ద్వారా 50 శాతం సబ్సిడీపై రైతులకు మోటార్లు అందించనున్నట్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు జలగం వెంగళరావు తనయుడు, మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు తెలిపారు. చింతూరు మండలంలోని ముకునూరు, నరసింగపేట, రామన్నపాలెం తదితర రైతులను శుక్రవారం ఆయన కలుసుకొని ఎంత మందికి మోటార్లు కావాలో స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సగం భరిస్తే మిగతా సగం జలగం వెంగళరావు ఛారిటీ ట్రస్ట్ ట్రస్ట్ భరిస్తుందని చెప్పారు. శబరినది, వాగుల దగ్గర ఉన్న పొలాలతో పాటు మండలంలోని మిగతా గ్రామాల రైతులు ముందుకొస్తే వారికి ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ ఎండీ.హబీబ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్కే.అహ్మద్ అలీ, ముకునూరు మాజీ సర్పంచ్ పూజారి పుల్లయ్య, బి.లక్ష్మణ్, బి.కన్నారావు, బి.పుల్లమ్మ, నర్సింగపేట గ్రామానికి చెందిన రవ్వ రాజయ్య, డి.శ్రీను, ఎస్.ముత్తయ్య, రామన్నపాలెం సర్పంచ్ నారాయణ, పండా నాగరాజు, డి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో వీధి కుక్కల బెడద

ప్రజాశక్తి-కొయ్యూరు

మండల కేంద్రం కొయ్యూరులో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ చిన్న పిల్లలపైనా, పశువులపైనా దాడి చేసి గాయపరుస్తున్నాయి. వాహనాలకు అడ్డుగా పడడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొయ్యూరుతో పాటు పలు మండలంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొయ్యూరులో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్ర ప్రదేశ్ నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కియా కార్ల కంపెనీలో ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణాభివృద్ధి అధికారి జి. ప్రశాంత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అభ్యర్థులు 18 నుండి 25 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు డిప్లమో, బిటెక్ విద్యార్హత కలిగి ఉండాలని చెప్పారు. పురుషులు మాత్రమే దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.17500 నెలకు జీతం చెల్లిస్తారని చెప్పారు. అనంతపురం జిల్లా పెనుగొండలో శిక్షణ అందిస్తారని అనంతరం ఉద్యోగాలలో నియమిస్తారన్నారు. పూర్తి వివరాలకు 63046 34447 లేదా 9396338105 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-చింతపల్లి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ భారతి ఆధ్వర్యాన ఆర్వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజా రవీంద్రనాథ్ చౌదరి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. కళాశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఏఎన్ఎం లక్ష్మి, కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

చెత్త బుట్టల పంపిణీ

డస్ట్ బిన్‌లను పంపిణీ చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పారిశుద్ధ్య నిర్మూలనలో భాగంగా ప్రభుత్వ యంత్రాంగం ఇంటింటా డస్ట్ బిన్ లను పంపించేయడం జరుగుతుందని ఆయా డస్ట్ బిన్ లను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కితలంగి సర్పంచ్ సుబ్బారావు చెప్పారు. కితలంగి పంచాయతీ గ్రామంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పంచాయితీ అభివృద్ధికి గ్రామ సభతో కూడిన తీర్మానం ఎంతో ముఖ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో సూరిబాబు, పంచాయతీ కార్యదర్శి, వార్డు నెంబర్లు పాల్గొన్నారు.

'మీ కోసం'లో వినతుల వెల్లువ

వినతిపత్రం ఇస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-పాడేరు : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు వినతులు వెల్లువెత్తాయి. అర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలని 184 ఫిర్యాదులును సమర్పించారు. జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ భావనా పశిష్ట, ఐటిడి ఏ పిఒ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి డి.ఆర్ఓ టి.పద్మావతి తో కలిసి స్వీకరించారు. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సాగు నీటి సమస్యలు, చెక్ డ్యాం నిర్మాణాలు, ఆరోగ్య సమస్యలు వైద్య సేవలు, అంగన్వాడీ కేంద్రాల మంజూరు, భూ సమస్యలపై ఎక్కువగా వినతులు అందాయి.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు రాజు, కె.వేణుగోపాల్, ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఐటిడిఏ పరిపాలనాధికారి ఎం.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

పాడేరు: పాడేరు ఐటీడీఏలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్‌కు అనంతగిరి మండల సమస్యలపై జడ్పిటిసి సభ్యులు దీసరి గంగరాజు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు మండలంలోని మారుమూల ప్రాంతమైన కర్రిగోడ, కడరేవు గ్రామాలకు ఫార్మేషన్ రోడ్డుకు ఫారెస్ట్ అనుమతులు మంజూరు చేయాలని, చిన్నకోనేల బూరుగు గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. పినకోట, పెదకోట పంచాయితీల్లో మద్రేబు, తునీసిబు, చీడిమెట్టు, బోనూరు రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. అనంతగిరి మండలంలో మారుమూల గ్రామాలకు రోడ్డు నిర్మాణానికి ఫారెస్టు అనుమతులు మంజూరు చేయాలని, గుమ్మ పంచాయితీ మారుమూల గ్రామాలు కర్రిగోడ కడరేవు గొపులపాలేం కొట్టెంగ్ గుడ గ్రామాల్లో ఫార్మేషన్ రోడ్లకు ఫారెస్ట్ అధికారులు అనుమతులు మంజూరు చేయాల, కోరడంతో కలెక్టర్ స్పందిస్తూ 15 నుండి 20 రోజుల్లో అనుమతులు మంజూరు చేసి సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.గోవిందరావు, గిరిజన సంఘం నాయకులు సోమెల అప్పలరాజు, కోటపర్తి సింహాచలం, శంకర్, పెంటయ్య నందుల రాజారావు, పెంటరావు, బి.గంగరావు, దేముడు,ఎస్.రాజారావు గిరిజనులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండలంలోని తుమ్మిడి పుట్టు, జబ్బడ, మంజగూడ, మవులపుట్టు, సుత్తి గూడ, సంఘంవలస, ఆర్లోయిపుట్టు, లక్ష్మీపురం పెద్దవీధి, గావెలిగూడ, బొకాయిగూడ గ్రామాల్లో బస్ సౌకర్యం కల్పించాలని జిల్లా కేంద్రంలో లక్ష్మీపురం సర్పంచ్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక పోవడంతో గిరిజనులు మండల కేంద్రానికి రావడానికి అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రైవేటు వాహనాలలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవు తున్నారని వివరించారు.

మండల కేంద్రంలో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సిహెచ్‌సి)లో గర్భిణీలకు స్కానింగ్‌ను ఏర్పాటు చేయాలని, గైనకాలజిస్ట్‌ని నియామకాలు చేపట్టాలని దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి శుక్రవారం పాడేరులోని గ్రీవెన్స్‌లో ఐటీడీఏ పీవో అభిషేక్ కు వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంచింగిపుట్టు, పెదబయలు, ఏఒబి సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు, మాచ్‌ఖండ్ ప్రాంతాల నుంచి గర్భిణీలు స్కానింగ్ చేయించుకోవడానికి సిహెచ్‌సి వస్తున్నారని తెలిపారు. స్కానింగ్ సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారని పిఒ కు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత అచ్చిబాబు, డుంబ్రిగుడ మండల క్లస్టర్ ఇంచార్జి రూడి త్రినాద్, అరకు అసెంబ్లీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గడుతుల మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన కలిగిస్తున్న ఫాసిజం ఛాయలు

- 'శతాక్షి' కవితల సంపుటి ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

శతాక్షి కవితల సంపుటిని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి- సీతమ్మధార : వందేళ్ల తర్వాత ప్రపంచాన్ని ఫాసిజం మళ్లీ చుట్టుముడుతోందని, ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనల ద్వారా చరిత్ర పునరావృతమౌతుందాయన్న ఛాయలతో ఆందోళనను రేకెత్తిస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. దీని ప్రభావం ప్రజాస్వామ్యంపైనా, సాహిత్యంపైనా చూపేలా ఉన్నాయన్నారు. శుక్రవారం అరసం విశాఖ శాఖ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆకాశవాణి పూర్వ కార్యక్రమాధిపతి, కవి రొక్కం కామేశ్వరరావు రచించిన 'శతాక్షి' కవితల సంపుటిని శర్మ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, స్వేచ్ఛగా మాట్లాడలేనప్పుడు, కవి తన భావాలను కవిత్వం ద్వారా వ్యక్తం చేయవచ్చన్నారు. . ప్రస్తుత విద్యా విధానం భాషకు విలువ లేకుండా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సేచ్చను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజాస్వామ్య, మానవతావాదులపై ఉందన్నారు శతాక్షి కవితాసంపుటి వర్తమానకాలానికి అనుగుణంగా ఉందని, యువతరానికి మేము కవిత్వం రాయగలమనే స్పూర్తినిస్తోందన్నారు. ఈ పుస్తకంలో కొత్త తరానికి కవి రొక్కం కామేశ్వరరావు సూచనలు చేశారన్నారు అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాహిత్య విశ్లేషకులు డాక్టర్.జి.వేణు పుస్తకాన్ని సమీక్షించారు. బివికె కాలేజీ విశ్రాంతాచార్యులు డివి. సూర్యారావు అరసం ఉపాధ్యక్షులు ఎస్ హనుమంతరావు, కార్యదర్శులు పి.శ్యామ్‌సుందర్, డాక్టర్ ఎన్.క్షేత్రపాల్‌రెడ్డి ఇతర సభ్యులు పాల్గొని కవి రొక్కంకామేశ్వరరావును సత్కరించారు. వివిధ సంఘాల నేతలు డిఆర్‌కె రావు, బొట్ట అప్పారావు, పల్లా జగదీశ్వరరావు, అడపా రామకృష్ణ, మేడా మస్తాన్ రెడ్డి, ఆచార్య వెలమల సిమ్మన్న, బివి.అప్పారావు, ఎస్.హనుమంతరావు, డాక్టర్ కెవిఎస్.మూర్తి, సిహెచ్,చిన సూర్యనారాయణ, కె.మధుసూధన్, తదితరులు కవి రొక్కం కామేశ్వరరావును అభినందించారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: పర్యాటక ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టడంతో పాటు ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పంచాయతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో పర్యాటక, పంచాయతి శాఖల అధికారులు, అరకు, అనంతగిరి మండలాల పర్యాటక ప్రాంతాల పంచాయతీల సర్పంచ్‌లతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులకు డ్రెస్, గ్లోస్, బూట్లు, హెల్మెట్ వంటి అవసరమైన వస్తువులు సరఫరా చేయాలని సూచించారు. పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అరకులో ఒక్క జేసిబి మాత్రమే ఉందని, స్కిల్డ్ లేబర్ దొరక నందున ఇబ్బందులున్నాయని డివిజినల్ పంచాయతి అధికారి వి.ఎస్.కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా మరో జేసిబి కొనుగోలుకు ప్రతిపాదనలు పంపిం చాలన్నారు. పర్యాటక రంగం నుండి పంచాయతీలకు వచ్చే ఆదాయం జనరల్ ఫండ్‌లో కాకుండా ప్రత్యేక పద్దులో పెట్టి నిర్వహణకు వెచ్చించాలని కలెక్ట సూచించారు.పర్యాటక భవనాలకు పర్యాటక శాఖ ఆస్తి పన్ను చెల్లించాల్సిం దేనని కలెక్టర్ స్పష్టం చేసారు.

ఆస్తి పన్నును శాస్త్రీయంగా మదింపు చేసి తగు విధంగా పన్నులు వేయాలని, ఇందుకు సంబంధించి ప్రకటనల ద్వారా ప్రజలకు తెలియజేయాలని పంచాయతి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు కొన్ని ప్రతిపాదనలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు శ్రీనివాస ఫణి, పర్యాటక అధికారి దాసు, జిల్లా పంచాయతి అధికారి కొండల రావు, డివిజినల్ పంచాయతి అధికారి వి.ఎస్. కుమార్, పెదలబుడు, పద్మాపురం, మాడగడ, సుంకరమెట్ట పంచాయతీల సర్పంచులు పి.దాసుబాబు, పి.సుష్మిత, ఎం.జ్యోతి, చినబాబు తదితరులు పాల్గొన్నారు

రోడ్లపైనే పశువుల తిష్ట!

కొత్తూరు రోడ్డు పై వాహనాలకు అడ్డంగా తిష్ట వేసిన పశువులు

ప్రజాశక్తి-అనంతగిరి రూరల్ : అరుకు ఘాట్ రోడ్ లో రోడ్ల పైనే సాయంకాల సమయంలో పశువులను తిష్ట వేస్తున్నాయి. దీంతో, ప్రమాదాల బారిన పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి బొర్రా గుహలు, అరుకు లోయ సందర్శనకు వచ్చిన పర్యాటకులు విలేకరులతో మాట్లాడుతూ, బుధవారం రాత్రి విశాఖపట్నం నుండి అరకులోయకు వస్తున్న వాహనదారుడు కొత్తూరులో రోడ్లపై ఆవులు ఉండడాన్ని గమనించక ప్రమాదానికి గురయ్యాడన్నారు.అధికారులు స్పందించి రోడ్లపై పశువులను విడిచి పెట్టకుండా ఉండేలా అవగాహన కల్పించాలని కోరారు.

నేడు పెంపుడు కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి-జిమాడుగుల: ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ర్యాబీస్ వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నట్టు పశువైద్యాధికారి ఎస్పి సుజనాకుమారి శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెంపుడు కుక్కలను తప్పనిసరిగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని సూచించారు. అత్యంత ప్రమాదకరమైన రేబిస్ వ్యాధిని నివారించాలంటే వ్యాక్సిన్ వేయించాలని, నిర్లక్ష్యం చేయవద్దన్నారు.

రేఖపల్లిలో జోరుగా సాగుతున్న పారిశుధ్య పనులు

రేఖపల్లిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి ఎస్సీ కాలనీలోని శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూనెం సరోజిని మాట్లాడుతూ వర్షాలు మొదలవడంతో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. దోమల వృద్ధిని తగ్గించడానికి డ్రైనేజీల్లో పూడికలు తీయిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రకాష్‌రావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హైవే నిర్మాణం వల్ల ఏర్పడ్డ సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగిలో నూతనంగా నిర్మించిన 516ఈ జాతీయ రహదారి వలన ఏర్పడిన ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు గణజాల తాతారావు జాతీయ రహదారి నిర్మాణ కంపెనీ ప్రతినిధులను శుక్రవారం కోరారు. జడ్డంగి శివారు వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో ఉన్న కొక్కిరిగెడ్డ కుడి, ఎడమ గట్లుపై నుండి ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు పొంగి ప్రవహించడం వలన సమీపంగా వున్న వాల్మీకినగర్ శివారు ఇళ్లకు వరద నీరు చేరుతుందని చెప్పారు. ఒంటితూము వద్ద బ్రిడ్జ్ నిర్మించి కాలువ నీరు రాకుండా పెద్ద బండలు, మట్టి ఎక్కువగా వేశారని, దాని వలన నీరు వెనక్కి తన్ని ముంపు ఏర్పడుతుందని పేర్కొన్నారు. జడ్డంగిలో వున్న మడేరు ఆనకట్టకు వెళ్ళడానికి దారి లేదని, దారి వద్ద కొత్తగా ఎత్తుగా వేసిన రోడ్డుకు ఎప్రోచ్ రోడ్ నిర్మించాలని కోరారు. రోడ్ 20 అడుగులు ఎత్తు ఉండడం వల్ల రాకపోకలకు వీలు లేకుండా ఉందన్నారు. రైతులకు నీరు అందించే ఆనకట్ట కుడి, ఎడమ కాలువ గేట్లు ఎప్పటికప్పుడు ఆపరేట్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జడ్డంగి సాయిబాబా గుడి కొత్తగా నిర్మించిన కల్వర్ట్‌కు సమీపంగా ఉండడం వలన నీరు అధికంగా పారి గుడి ఆవరణ కోతకు గురి అవుతుందని పేర్కొన్నారు. పై సమస్యలపై కంపెనీ ప్రతినిధి భరత్‌తో చర్చించారు. దీనిపై స్పందించిన ఆయన ఒంటి తూము వద్ద కాలువకు అడ్డంగా వున్న బండలు, మట్టి, తుప్పలు వెంటనే తొలగిస్తామని, ఆనకట్టకు ఎప్రోచ్ రోడ్ నిర్మిస్తామని, సాయిబాబా గుడి వద్ద కాంక్రీట్ వాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వాసంశెట్టి గంగాధర్, బారంగి అనుదీప్, చెక్కా పండుబాబు, దబ్బా దివాకర్ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి వైసిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలో చినమట్టపల్లి పంచాయతీ పరిధి చింతరేవుపల్లిలో వైసిపి కార్యకర్త కోటం పాండురాజు భార్య కోటం వెంకటలక్ష్మి అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతి చెందగా, ఆ కుటుంబాన్ని వైసిపి మండల నాయకులు శుక్రవారం పరామర్శించారు. పాండురాజును ఓదార్చిన వైసిపి నాయకులు కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైసిపి మండల కమిటీ తరుపున మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు, చినమ్మట్టపల్లి స్థానిక సర్పంచ్ పిట్టా, రామారావు చేతుల మీదుగా దహనసంస్కారాలు నిమ్మిత్తం రూ.6000 అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మాచర్ల గంగయ్య, మండలం వైస్ ప్రెసిడెంట్ చిక్కాల బాలు, రాష్ట్ర నాయకులు ముత్యాల మురళి తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడ లేక ప్రమాదాలు

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం ఆడాకుల, చమ్మచింత గ్రామాలకు మధ్య ఉన్న వంతెన వద్ద రక్షణ గోడ లేకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు పనుల్లో వంతెన వద్ద మట్టి వేసి వదిలేశారు. దీంతో అక్కడ నెల రోజుల వ్యవధిలోనే పలు వాహనాలు ప్రమాదాలకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పడగవిప్పిన డయేరియా

మోటూరుపాలెంలో 18 మందికి వాంతులు, విరేచనాలు
కలుషిత ఆహారమే కారణం
కెజిహెచ్ సహా పలు ఆసుపత్రుల్లో బాధితులు

అచ్యుతాపురం ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ప్రజాశక్తి - అచ్యుతాపురం

మండలంలోని సెజ్ పునరావాస కాలనీ మోటూరుపాలెంలో డయేరియా పడగవిప్పింది. కలుషిత ఆహారం తినడం వల్ల 18 మంది ఇప్పటి వరకూ డయేరియా బారినపడ్డారు. వారంతా వాంతులు, విరేచనాలతో మంగళవారం నుంచీ అస్వస్థతకు గురవుతూ వస్తున్న విషయం శుక్రవారానికి గుప్పుమంది. తొలుత సాధారణ అనారోగ్యమే అనుకున్నప్పటికీ మూడు రోజులుగా బాధితులు పెరుగుతుండటంతో వైద్యులు అప్రమత్తమయ్యారు. డయేరియా సోకినట్టు వారు తెలిపారు.

కారణమేంటి ?

గ్రామానికి వచ్చిన ఓ చిల్లర వర్తకుని వద్ద సోమవారం కొంతమంది బజ్జీలు కొనుగోలు చేశారు. అవి తిన్న ఆ రాత్రి నుంచే వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయి. వారంతా ఇంటి బయట బహిరంగ ప్రదేశంలో మూత్ర, మల విసర్జన చేస్తూ వచ్చారు. అక్కడే వాంతులు చేసుకున్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఈగలు పెరిగి చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించాయి. అవి జనం తినే ఆహార పదార్థాలపై వాలడంతో డయేరియా ప్రబలింది. మంగళవారం ఉదయానికి కొంతమంది ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరారు. ఇలా క్రమేపీ ఆసుపత్రుల్లో చేరిన వారి సంఖ్య శుక్రవారానికి పెరిగింది. గ్రామంలో వ్యాధి లక్షణాలు తీవ్రమవడంలో ఎంపిడిఒ సురేష్ కుమార్ దృష్టికి వైద్య సిబ్బంది సమస్యను తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ బాలాజీ, డిఐఒ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సతీష్, డాక్టర్ విజయ్ కుమార్ గ్రామాన్ని సందర్శించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

బాధితులు ఎక్కడెక్కడ ?

బాధితుల్లో కక్కల మేఘన, పంచదారల నాగమణి, పంచదారల ఫణీంద్ర, కక్కల వినయ్, కక్కల అశ్వినిలను విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో కక్కల రమ్య, దమ్ము సాయి, డొక్క అప్పలనర్సమ్మ చికిత్స పొందుతున్నారు. అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముప్పిడి భవ్య, ముప్పిడి ఝాన్సీ, ముప్పిడి వంశీ, ముప్పిడి సురేష్, డేవిడ్ రాజ్, నూకరత్నంలకు డాక్టర్లు వైద్య సేవలు అందిస్తున్నారు. డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే అప్రమత్తమైనట్టు వైద్యులు పేర్కొన్నారు. డయేరియా సోకిన విషయం తెలిసి యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శుక్రవారం మోటూరిపాలెం గ్రామాన్ని సందర్శించారు. అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పొందుతున్న డయేరియా వ్యాధిగ్రస్తులను పరామర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహశీల్దార్ రజిని, ఎంపిడిఒ సురేష్ కుమార్ ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి : సిపిఎం

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అధికారులను కోరారు. గ్రామ పరిసరాలను శుభ్రపరచాలని, డయేరియాపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నిల్వ ఆహార పదార్థాలు విక్రయించేవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలో మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ అన్నారు. కొయ్యూరు మండలం డౌనూరు పీహెచ్సీ చిట్టింపాడు సబ్ సెంటర్ పరిధిలోని గదబపాలెంలో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామంలో చేపడుతున్న దోమల మందు పిచికారీని పర్యవేక్షించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఇంటా, బయట తప్పనిసరిగా దోమల మందు పిచికారీ చేయించుకోవాలని కోరారు. డౌనూరు పిహెచ్‌సి పరిధిలో మలేరియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయండి

సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కూనవరం

డిసెంబర్ 14 నుంచి 17వ తేదీ వరకు కాకినాడలో నాలుగు రోజుల పాటు జరుగు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్వర్ణోత్సవాలను విజయవంతం ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక విద్య వనరులు కేంద్రంలో యుటిఎఫ్ కూనవరం మండల కమిటీ అధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిసెంబర్ నెలలో ఈ స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విద్య రంగాన్ని కాపాడవలసిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధారకొండ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ రాజు

పలుచోట్ల గ్రామసభలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు, దారకొండ పంచాయతీల్లో ఆయా పంచాయతీల కార్యదర్శి వాసం శ్రీనివాస్ ఆధ్వర్యాన, సర్పంచ్‌లు దుర్జు, ఎన్.రాజు అధ్యక్షతన శుక్రవారం వేర్వేరుగా గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా పంచాయతీ జమా ఖర్చులు ప్రజలకు కార్యదర్శి శ్రీనివాస్ వినిపించారు. దారకొండ గ్రామసభలో గిరిజన రైతులు వరి విత్తనాలు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని కోరారు. అలాగే రాగులు కూడా పంపిణీ చేయాలన్నారు. దీనికి కార్యదర్శి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి విత్తనాలు అందే విధంగా కృషి చేస్తారని హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. మంచినీటిపై దృష్టి సారించిన కోరారు. దారకొండ గ్రామ సభలో కూటమి నాయకులు పి.కృష్ణ, ఎస్.జగన్, పోతురాజు గోవిందు, సీలేరు పంచాయతీ సభలో గుమస్తా ప్రకాష్ ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సెలవులు మంజూరుపై వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం : గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయులకు సెలవు మంజూరు చేసే అధికారం గతంలో మాదిరిగా ప్రధానోపాధ్యాయులకు కొనసాగించాలని ఐటిడిఎ పిఒకు యుటిఎఫ్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన పిఒ ఉపాధ్యాయులకు సెలవు మంజూరునకు ఎటిడబ్ల్యుఒలకు ఇచ్చిన ఉత్తర్వులను సవరిస్తామని, హెచ్ఎంలు సెలవు మంజూరు చేసి, సదరు లీవ్ లెటర్స్‌ను ఎటిడబ్ల్యుఒలకు మెయిల్ చేసేలా ఆదేశాలిస్తామని ప్రాజెక్ట్ ఆఫీసర్ హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వై విల్సన్ బాబు కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి, ఐటీడీఏ సబ్ కమిటీ కన్వీనర్ కె.ఆదిరెడ్డి, సబ్ కమిటీ కో కన్వీనర్ కె.సూరిబాబు, రంపచోడవరం అధ్యక్షులు సనాతన బాబు, దేవీపట్నం మండల ప్రధాన కార్యదర్శి చిన్ని బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కూలిపోయిన బాధితునికి పరామర్శ

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలో రామవరం గ్రామంలో మూడు రోజుల క్రితం రాత్రి వేళ గాలి వానకు కూర లక్ష్మయ్య ఇల్లు కూలిపోవడంతో శుక్రవారం సిపిఎం, టిడిపి నాయకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించిన బాధితుడిని పరామర్శించారు. గాలి వానకు ఇల్లు కూలిపోయిన సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులకు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, కూర లక్ష్మయ్యకు తలపై దెబ్బ తగిలిందని కుటుంబ సభ్యులు సర్పంచ్ కారం బుచ్చమ్మకు, సిపిఎం, టిడిపి నాయకులకు తెలియజేశారు. ఇల్లు కులిపోయిన బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కారం సత్యం, టిడిపి నాయకులు బుర్కా కన్నారావు, ఆచంట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి- కొయ్యూరు : కొయ్యూరు మండలం నల్లగొండ పంచాయతీ పరిధి బోయవుట కొత్తవీధి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌కు పబ్లిక్ గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసినట్లు టిడిపి నాయకులు పాంగి భీమరాజు, ఎస్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి జంపా వెంకటరమణ తెలిపారు. గ్రామానికి కనీస విద్యుత్ సౌకర్యం లేదని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫారెస్ట్ అనుమతులు లేనిదే విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు వీలుపడదని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.